# ఫెయిర్ అండ్ లవ్‌లీ

"ఫెయిర్ అండ్ లవ్‌లీ" అన్నది జయంతి. జయంతి అడిగిన దాన్ని ఆమెకిస్తూ అదోలా నవ్వుతూ ఆమెను చూశాడు షాపతను. ఆ షాపులో అతను, ఆమె వున్నారు. జయంతి ఆ షాపులోకి వెళుతున్నప్పుడే ఓ ఇద్దరు ఆడవాళ్ళు వెళ్లిపోయారు.

"నవ్వెందుకు?" అడిగింది జయంతి.

షాపులో కుర్రాడు జయంతి కంటే ఐదారేళ్ళు చిన్నవాడిలా అనిపించాడు.

అతడు జవాబు చెప్పలేదు.

"ఇంకా ఏం కావాలి చెప్పండి?" అంటూ అడిగాడు మళ్ళీ అదే చిరునవ్వుతో.

"ఆల్ పర్పస్ క్రీమ్"

"ఇంకా"

"ఐ బ్రో పెన్సిల్, లాక్మే నెయిల్ పాలిష్"

"ఇంకా ఏమైనా వున్నాయా?"

"అల్మండ్ డ్రాప్స్"

ఆమె అడిగినవన్నీ కొన్ని నిముషాల్లో షాపతను జయంతికి ఇచ్చాడు ప్యాక్ చేసి.

అతను బిల్ రాస్తున్నప్పుడు జయంతి అతడ్ని కొంచెం పరిశీలనగా చూసింది. సన్నగా, పొడుగ్గా వున్నాడు. కొంచెం నల్లగా వున్నాడు. పలుచగా వున్న జుట్టు, అంతగా సన్నగా లేని మీసాలు, చాల సాధారణమైన మొహంలా అనిపించింది జయంతికి.

బిల్‌ను జయంతికి ఇస్తున్నప్పుడు ఆమె అతన్ని అడిగింది – "నీకు పెళ్ళయ్యిందా?"

"చూస్తున్నారు కదా? ఎలా కనిపిస్తున్నాను?" అన్నాడతను నవ్వుతూ....

"తెలియకే అడిగాను. నాకేమీ తెలీటంలేదు"

"ఇంకా నా చదువే పూర్తి కాలేదు. డిగ్రీ సెకండియర్ చదువుతున్నాను. సెలవురోజులని ఈ షాపులో వున్నాను. ఈ షాపు మా అన్నయ్యది. అతనికి పెళ్లయ్యింది. ముగ్గురు పిల్లలు"

జయంతి అతనికి డబ్బు ఇచ్చింది. అతను మిగిలిన చిల్లర ఇస్తున్నప్పుడు "ఇప్పుడైనా చెబుతావా?" అన్నది.

"ఏమిటి?"

"ఫెయిర్ అండ్ లవ్‌లీ – అడిగినప్పుడు నువ్వు నవ్వావు ఎందుకు?"

"ఇంతకీ ఫెయిర్ అండ్ లవ్‌లీ మీకేనా?"

"అవును నాకే"

"అలా అనుకునే నవ్వాను. ఎందుకంటే మీరు తెల్లగా వున్నారు. ఫెయిర్ అండ్ లవ్‌లీని నల్లగా వున్నవాళ్ళు, చామనఛాయలో వున్నవాళ్లు వాడతారు. కానీ తెల్లగా వున్న మీరు ఫెయిర్ అండ్ లవ్ అడిగారని నవ్వాను. న్యాయంగా దాని అవసరం మీకు లేదు గదా?"

"తెల్లగా వున్నవాళ్లు మరింత తెల్లగా వుండాలనుకోవటంలో తప్పులేదు కదా?" అన్నది జయంతి.

"అవును" అన్నాడతను.

"ఇంతకీ మీ పేరేమిటి?" అడిగింది బయటకు రాబోతూ వెనక్కి తిరిగి.

"ప్రేమ్‌కుమార్" అన్నాడతను.

"చాలా బావుంది" అంటూ నవ్వుతూ షాపులో నుంచి బయటకు వచ్చింది.

జయంతి రోడ్డుమీద నడుస్తున్నప్పుడు పడమటికి జారిపోతున్న సూర్యుడి కిరణాలు ఆమె మొహం మీద పడ్డాయి. అరగంట క్రితం ఆమె ఆఫీసులో నుంచి బయటకు వచ్చింది. ఆఫీసు నుంచి కొంత దూరం నడిస్తేగానీ ఆమె ఎక్కవలసిన బస్సుస్టాపు రాదు. బస్టాపుకు వెళ్లే దారిలో కనిపించిన లేడీస్ కార్నర్‌లోకి ఆమె వెళ్ళి తిరిగి బయటకు వచ్చింది.

రోడ్డు బాగా రద్దీగా వుంది.

చిన్నగా నడిచి బస్టాపు దగ్గరకు జయంతి వచ్చేసరికి అక్కడ చాలామంది బస్సులకోసం ఎదురుచూస్తూ రోజూలాగే కనిపించారు. అందరినీ ఓసారి చూసింది జయంతి. ఆమెకు నీలిమ కనిపించలేదు.

రోజూ తను వచ్చేసరికి నీలిమ బస్టాపులో వుంటుంది. ఈరోజు నీలిమ ఆఫీసుకు రాలేదేమో అనుకుంది జయంతి. నీలిమ గుర్తుకు రావటంతోనే జయంతికి శేషు కూడా గుర్తుకు వచ్చాడు. ఆమె మనసంతా అసూయతో నిండిపోయింది.

బస్టాపుకు కొంచెం దూరంగా ఒంటరిగా నిల్చుంది జయంతి. ఆమె ఆలోచనలన్నీ నీలిమ గురించే.

బస్టాపులోనే నీలిమకీ, జయంతికీ పరిచయమయ్యింది. ఇద్దరూ ఉద్యోగం చేస్తున్నారు. ఇద్దరికీ పెళ్ళి కాలేదు. ఈ కారణంగా వాళ్ళిద్దరూ చాలా తక్కువ రోజుల్లోనే మంచి స్నేహితులయ్యారు. నీలమ కంటే ఓ నాలుగేళ్ళు ఎక్కువే వుంటాయి జయంతికి.

నల్లగా వుంటుంది నీలిమ. కాని ఆమె మొహంలో ఆకర్షణ వుందనీ, నవ్వులో ఎదుటి వ్యక్తిని ఆకట్టుకునే గుణం వుందనీ, నీలిమ కళ్ళు మెరుస్తూ అందంగా వుంటాయనీ జయంతి ఆమెతో పరిచయమైన రెండు రోజుల్లోనే తెలుసుకున్నది.

వాళ్ళిద్దరూ బస్టాపులో నిల్చున్నప్పుడు చాలామంది మగవాళ్ళు నీలిమనే చూస్తుండటం జయంతి రోజూ గమనించేది. ఆమె దృష్టిని ఆకర్షించాలని ప్రయత్నాలు చెయ్యటం, ఆమె తమవైపు చూస్తే బావుండనుకునేలా మగాళ్ళు ఆమెను చూడటం జయంతికి నీలిమమీద ఆసూయనే కలిగించాయి.

నీలమ కంటే తెల్లగా, కొంచెం లావుగా వుండే తనని అంతగా ఎవ్వరూ పట్టించుకున్నట్టు ఎప్పుడూ అనిపించలేదు. అయితే– నల్లగా వున్నా అందం అంతగా లేని, కేవలం ఆకర్షణే ఎక్కువగా వున్న ఆడవాళ్లంటేనే ఈ మగవాళ్లకు ఇష్టమా?

అవును. అంతే అయివుండాలి. లేకపోతే ఎంతో అందంగా, తెల్లగా హుందాగా వుండే శేషు– నీలిమతో ప్రేమలో పడతాడా?

నీలిమ– శేషు ప్రేమించుకున్న విషయం, కొన్ని రోజుల్లో పెళ్లి చేసుకోబోతున్నట్టు నీలిమ– జయంతితో పరిచయమైన కొన్ని రోజులకే చెప్పింది. అప్పుడే జయంతి మనసు జెలసీతో మూల్గింది.

ఎంతగా ఆలోచించినా నీలిమ– శేషుకు తగిన జోడీ కాదు. ఈ విషయాన్ని ఎవరయినా ఒప్పుకుంటారు. కానీ శేషు– నీలిమని ఎలా ప్రేమించాడు? పెళ్ళి చేసుకోటానికి ఎలా అంగీకరించాడు? నీలిమలో అతనికి ఏం కనిపించింది? ఇలాంటి ప్రశ్నలకు జయంతి దగ్గర జవాబు లేదు.

నీలిమతో తనని పోల్చుకుంది జయంతి.

తను నీలిమ కంటే అందంగా వుంటుంది. కాకపోతే కొన్ని కారణాలవల్ల ముప్పై ఏళ్లు వస్తున్నా ఇంకా తన పెళ్ళి కాలేదు. ఎవర్నయినా ప్రేమించి పెళ్ళి

చేసుకోవాలని తను ఎప్పటినుంచో అనుకుంటున్నది. కానీ ప్రేమించడానికి తనకి సరిపోయినవాళ్లు ఎవ్వరూ అందుబాటులోకి రావడంలేదు.

తన అందంలో ఏదైనా లోపం వుందా? అని తను ఎన్నోసార్లు ఆలోచించింది. ఉండే వుంటుంది. అందుకే తను ఎక్కడ వున్నా ఏ మగవడూ తనతో చనువుగా వుండే ప్రయత్నం చెయ్యటంలేదు.

ఓ నాలుగు నెలల క్రితం ఈశ్వరరావు అనే మగవాడు జయంతికి దగ్గరగా వచ్చే ప్రయత్నం చేశాడు. బస్టాపు దగ్గరే ఆమెతో పరిచయం చేసుకుని, రోజూ ఆమెను అక్కడే కలవటం మొదలుపెట్టాడు. ముందు కొంచెం బెట్టుగా అతను ఒకరోజు మర్యాదకోసం కాఫీ తాగటానికి హొటలుకు రమ్మని అడిగాడు.

అందుకు జయంతి బాగా కోపం తెచ్చుకుని ఈశ్వరరావుతో సీరియస్‌గా రానన్నది. అతటితో ఈశ్వరరావు ఆ బస్టాపుకే రావటం మానేశాడు.

ఆ తర్వాత ఎవ్వరూ జయంతిని అంతగా గుర్తించలేదు. ఈశ్వరరావుతో ఆరోజు కాఫీకి వెళ్లివుంటే బావుండేది. గొప్ప పొరపాటు చేశాననుకుంది జయంతి ఆ సంఘటన గుర్తుకొచ్చి.

జయంతి ఆలోచనల్లో వుండగా నీలిమ వచ్చి "ఎంతసేపయ్యింది నువ్వొచ్చి" అన్నది.

చెప్పింది జయంతి.

"శేషు వచ్చాడా?" ఆత్రంగా అడిగింది నీలిమ.

"రాలేదు"

"ఏమిటి బ్యాగ్ ఎత్తుగా వుంది. ఏమైనా కొన్నావా?" అడిగింది నీలిమ. కర్చీఫ్‌తో మొహాన్ని తుడుచుకుంటూ జిప్ లాగి చూపించింది జయంతి.

లోపలకు చూస్తూ "ఫెయిర్ అండ్ లవ్‌లీ.... ఇంకా...." అడిగింది.

చెప్పి బ్యాగ్‌ను మూసింది.

"నీకు చాలా ఓపిక వుంది జయంతీ ఇవ్వన్నీ వాడటానికి" అన్నది నీలిమ.

"అలా అనుకుంటే ఎలా?" నిజానికి ఫెయిర్ అండ్ లవ్‌లీ నీలాంటివాళ్ళే ఎక్కువగా వాడాలి!" అన్నది జయంతి చిన్నగా నవ్వుతూ.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? నీకు తెలుసు. నల్లగా వున్నవాళ్ళు దీన్ని వాడితే తెల్లగా

అవుతారు”

“వద్దులే జయంతీ ఇలా వుంటేనే ఈ మగవాళ్ళతో చస్తున్నాను. ఇంకా తెల్లగా వుంటే నన్ను అసలు బతకనివ్వరు” అన్నది నవ్వుతూ.

నవ్వుతున్న నీలిమను అసూయను మనసులో నొక్కుకుంటూ నవ్వుతూ చూసింది.

ఇంతలో శేషు వచ్చి ముందు నీలిమను నవ్వుతూ ఈశ్వరరావు ఇప్పుడెక్కడున్నాడో అనుకుంది.

❖ ❖ ❖

మళ్ళీ ఓ సాయంత్రం బస్టాపులో నిల్చుంది జయంతి. అక్కడ నిల్చున్న చాలామందిని చూసిన తర్వాత “నీలిమ ఇంకా ఊర్నించి రాలేదేమో” అనుకుంది. వారంరోజుల క్రితం తన తల్లికి ఒంట్లో బావుండలేదని నీలిమకు తండ్రి దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది. ఆమె వెంటనే ఊరికి వెళ్ళిపోయిందిట.

ఈ విషయాన్ని నీలిమ ఊరెళ్లిన రెండో రోజు శేషు బస్టాపు దగ్గర నిల్చున్న జయంతితో చెప్పాడు.

ఆరోజు వెళుతున్న శేషు– జయంతిని చూసి ఆగిపోయాడు.

“తను ఊరెళుతున్నట్టు మీతో చెప్పమన్నది” అంటూ అంతా చెప్పాడు.

“మళ్లీ ఎప్పుడు వస్తుంది?” అడిగింది జయంతి.

“చెప్పలేదు. ముందు ఓ వారంరోజులు లీవ్ పెట్టింది... వెళతాను” అంటూ అతను వెళ్ళబోయాడు.

“ఆగండి.... మీతో రెండు నిముషాలు మాట్లాడాలి” అన్నది జయంతి.

“చెప్పండి” అన్నాడు శేషు.

“నీలిమ గురించి మీరేమనుకుంటున్నారు?” అని కొంచెం చిన్నగా అడిగింది.

“అంటే?”

“అమె కేరక్టర్ గురించి”

అతనామెను ఆశ్చర్యంగా చూశాడు.

“మంచిదనుకుంటున్నాను ఏం కాదా”

“కాదనుకుంటాను. ఓ ఫ్రెండ్ చెప్పింది నీలిమ కేరక్టర్ అంత మంచిది కాదని. ఈమధ్య తనే అన్నది తన వెంటబడే మగాళ్ళతో చచ్చిపోతున్నానని”

థాంక్ యూ" అతను బయల్దేరుతూ అన్నాడు.

"నేనిలా మీతో చెప్పినట్టు మీరు నీలిమతో....." ఆమె పూర్తిగా మాట్లాడకుండానే శేషు హీరో హొూండా మీద వెళ్ళిపోయాడు.

తనలా నీలిమ గురించి శేషుతో చెప్పిన విషయం గుర్తుకొచ్చి జయంతికి భయమేసింది.

శేషు ఈ విషయాన్ని నీలిమతో చెబితే?

ఇంతకీ నీలిమ ఊర్నించి వచ్చిందా?

ఆమె అలా అనుకున్నప్పుడే కొంచెం దూరంతో నడిచి వస్తున్న నీలిమ కనిపించింది.

జయంతి గుండెలు అదిరాయి.

"ఎలా వుంది మీ అమ్మకి" అడిగింది జయంతి– నీలిమ దగ్గరగా వచ్చిన తర్వాత.

"ఇప్పుడు బాగానే వుంది. అనవసరంగా కంగారుపడి నిన్ను చూడాలని టెలిగ్రాం ఇప్పించింది...."

"పోన్లే" అన్నది జయంతి.

"శేషు వచ్చాడా?" అడిగింది నీలిమ.

"రాలేదు"

రెండు నిముషాలు నీలిమ మాట్లాడలేదు. రోడ్డుమీద వెడుతున్న వాహనాలను, మనుషులనీ చూస్తూ వుండిపోయింది. తర్వాత ఏదో గుర్తుకొచ్చినదానిలా "జయంతి... ఫెయిర్ అండ్ లవ్‌లీ రాస్తే నల్లని చర్మం చెల్లబడుతుందని చెప్పావు కదూ!" అన్నది.

"అవును"

"మరి నల్లటి మనసున్నవాళ్ళకి ఆ నలుపును పోగొట్టాలంటే ఏ క్రీమ్ వాడాలి?" అని అడిగింది నీలిమ చాలా సౌమ్యంగా.

అప్పుడు.... ఆ సమయంలో నల్లబడిన జయంతి మొహాన్ని ఏ క్రీమూ తెల్లపరచలేదు. ❖

*స్వాతి వారపత్రిక, 8-8-1997*